లలితాత్రిపుర సుందరీదేవి నమోస్తుతే

- వైభవంగా దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు
- ఏడో రోజూ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు
- కొనసాగిన భక్తుల రద్దీ


లలితాత్రిపురసుందరీదేవిగా చదునుమహాలక్ష్మమ్మ


ధాన్యలక్ష్మీగా పద్మావతీదేవి


లలితాత్రిపురసుందరీదేవిగా గంగానమ్మ అమ్మవారు


మహాలక్ష్మీదేవిగా భ్రమరాంబ దర్శనం


భీమనవారిపేటలో దుర్గాదేవిగా


కరకట్ట వద్ద లలితాత్రిపుర సుందరీదేవిగా


పాలప్రాజెక్టు క్వార్టర్స్ వద్ద వైభవ లక్ష్మీదేవిగా


చిట్టినగర్‌లో సంతోషిమాతగా

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజైన శనివారం ఆలయాల్లో అమ్మ వార్లు లలితా త్రిపుర సుందరీదేవిగా, శ్రీ ధాన్యలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. తెల్లవారు జాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకొని అమ్మ వార్లను దర్శించుకున్నారు. దీంతో నగరంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది.

పలు దేవస్థానాల్లో..

వన్‌టౌన్ బ్రాహ్మణవీధిలోని దేవదాయ ధర్మదాయ శాఖకు చెందిన శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలోని శ్రీ పద్మావతి అమ్మవారి శనివారం శ్రీ ధాన్యలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వైదిక కార్యక్రమాలను ఆలయ అర్చకుడు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి పర్యవేక్షించారు. ఆలయ ఈవో ఘంటసాల శ్రీనివాసు పర్యవేక్షించారు. వన్‌టౌన్ శేషయ్యవీధిలోని శ్రీ కృష్ణ ప్రార్థనా సంఘం ప్రాంగణంలో ఉన్న శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు శ్రీ లలితాత్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు. సాయంత్రం సంకీర్తనా గానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయంలో ఉత్సవాలను కమిటీ అధ్యక్షుడు గోకవరపు మురళీకృష్ణ, కార్యదర్శి గుడిపాటి పాపారావు పర్యవేక్షించారు. బ్రాహ్మణవీధిలో వేంచేసి ఉన్న శ్రీ చదును మహాలక్ష్మమ్మ దేవస్థానంలో అమ్మవారు లలితాత్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పాలక మండలి పర్యవేక్షించింది. కేటీ రోడ్డులో కొలువై ఉన్న శ్రీ గంగానమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు శ్రీ లలితాత్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కొత్తపేట సైకం వారి వీధిలో వేంచేసి ఉన్న శ్రీ దర్భేశ్వరస్వామి వారి దేవస్థానంలో పార్వతీ అమ్మవారు శ్రీ లలితత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు మురళీ కార్యక్రమాలను పర్యవేక్షించారు. శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం)లో కొలువై ఉన్న భ్రమరాంబ అమ్మవారు శ్రీ మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కుంకుమార్చనలు, చండీహోమం, ఖడ్గమాలర్చాన తదితర వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. స్వామి వారికి రుద్రాభిషేకాన్ని చేపట్టారు. ఈవో నాగరాజు పర్యవేక్షించారు.

చిట్టినగర్ వ్యాప్తంగా

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భీమన వారి పేటలోని శ్రీవిజయదుర్గా రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు చింతలపాటి వెంకటసుబ్రహ్మణ్య శాస్త్రి, పవన్‌కుమార్ శర్మలు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. చిట్టినగర్‌లోని శ్రీమహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో అమ్మ వారు సంతోషిమాతగా అలంకరించారు. గవర్నర్ కార్యాలయ జాయింట్ సెక్రటరీ సూర్యప్రకాష్ దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్, నగరాల సంఘ నాయకులు బాయన వెంకట్రావులు పూజలు జరిపించుకున్నారు. కరకట్ట సమీపంలోని శ్రీ భవానీ దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాల్లో అమ్మవారిని లలితా త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. ఆలయ అర్చకుడు దంటు భవానీశర్మ పర్యవేక్షణలో పూజలు నిర్వహించారు. పాల ప్రాజెక్టు క్వార్టర్స్ సమీపంలోని శ్రీ లలితాంబికా పీఠంలో అమ్మవారిని శ్రీవైభవ లక్ష్మీదేవిగా అలంకరించారు. పీఠాధీశ్వరి శివలీల మాతశ్రీ పూజా కార్యక్రమాలను నిర్వహించగా, ఉత్సవాలను పీఠం కన్వీనర్ రాంపిళ్ల చైతన్య పర్యవేక్షించారు. కొత్తపేట వాగు సెంటర్‌లోని శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి ఆలయంలో అమ్మవారిని లలితా త్రిపురసుందరీదేవిగా అలంకరించారు. ఆలయ అర్చకుడు విన్నకోట శ్రీనివాసరావు పర్యవేక్షణలో లోలాగు విజయభాస్కర్, రాణి దంపతులచే హోమం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఈవో రావూరి వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.


కొత్తపేట ఆలయంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

క్లుప్తంగా

అందరూ క్యూలో వెళ్లాల్సిందే !



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాల్లో భాగంగా శనివారం నుంచి భక్తుల రద్దీ పెరగడంతో సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉండాలని సీపీ టీకే రాణా సూచించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చెకింగ్ పాయింట్ల వద్ద భక్తులు పెద్ద ఎత్తున గుంపులు గుంపులుగా ఉండటంతో సీపీ సిబ్బందిని అప్రమత్తం చేశారు. టికెట్లు ఉన్నా, వీఐపీలైనా సరే క్యూలోనే ఆలయంలోకి అనుమతించాలని చెప్పారు. ఆలయ ప్రాంగణంలో అదనపు సిబ్బందిని ఏర్పాటు చేయాలని ఏసీపీ హనుమంతరావును ఆదేశించారు. దీంతో ఆలయం గేట్ నెం–1 వద్ద కొత్తపేట సీఐ సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. భక్తులందరినీ గేట్ ద్వారా క్యూలోకి అనుమతించారు. ఆలయంలోకి వచ్చే వారి వివరాలను అడిగి తెలుసుకోవడమే కాకుండా వారి వద్ద టికెట్లు ఉన్నాయా లేదా అని ఆరా తీశారు. ఉత్సవాల చివరి మూడు రోజులు మరింత అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు.

బైక్ ఢీ కొని మైనర్లకు గాయాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బైక్ ఢీ కొని ముగ్గురు మైనర్లకు గాయాలైన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రైజర్ పేటకు చెందిన సీహెచ్ వెంకట అభిరామ్ పేదో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం అభిరామ్ తన స్నేహితులైన నాగరాజు, నవీన్‌లతో కలిసి మోపెడ్‌పై చిట్టినగర్ సెంటర్‌కు వచ్చాడు. తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో వేగంగా వచ్చిన బైక్ వారిని ఢీ కొట్టింది. దీంతో ముగ్గురికి గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

కారు ఢీ కొని..

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కారు ఢీ కొనడంతో ఒకరికి తీవ్రగాయాలైన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వైఎస్సార్ కాలనీకి చెందిన వై.వరలక్ష్మి, వెంకట తులసీరామ్ భార్యభర్తలు. శుక్రవారం రాత్రి బైక్‌పై తులసీరామ్ ప్రభాస్ కాలేజీ వైపు నుంచి చిట్టినగర్‌కు వస్తుండగా, ఎర్రకట్ట మధ్యలో వేగంగా వచ్చిన కారు ఢీ కొట్టింది. దీంతో తులసీరామ్‌కు గాయాలు కాగా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడి భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య !



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై ప్రభుత్వ రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ–కృష్ణా కెనల్ మధ్య శనివారం ఉదయం రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి తల, మొండెం వేరుగా పడి మృతిచెంది ఉన్నాడు. దీన్ని గమనించిన కీమెన్ జీఆర్పీ పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుని వయస్సు 35 ఏళ్ల ఉంటుందని, తల, మొండెం తెగిపోయి వేరుగా ఉండటంతో గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వివరాలకు విజయవాడ జీఆర్పీ పోలీసులను సంప్రదించాలని కోరారు.

మధురం వాగ్గేయకార సంకీర్తనం

విజయవాడకల్చరల్: శ్రీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని లబ్బీపేట శ్రీ శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న సంప్రదాయ నృత్యాలు సంగీత కార్యక్రమాలు ఆకట్టుకుంటున్నాయి. శనివారం నాటి కార్యక్రమంలో సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ నిర్వహించిన వాగ్గేయకార సంకీర్తనం మధురంగా సాగింది. ముత్తుస్వామి దీక్షితార్ కీర్తన సోదరి నాగగాంధారి, త్యాగరాజ స్వామి కృతి సుందరి నీ దివ్యరూపం, శ్యామశాస్త్రి కీర్తన జూడు, ముత్తయ్య భాగవతార్ కీర్తన నన్నాదరింపవే, అన్నమయ్య సంకీర్తన, సుధాకర్ రచన కనకదుర్గా, అన్నమయ్య కీర్తన నీవుగొల్లబోయిడా..కీర్తనలను ఆలపించారు. సంగీత విద్వాంసుడు వేమూరి విశ్వనాథ్, అంజనా సుధాకర్ పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటు Mrs. Shriram Finance Ltd. [illegible]

రాయపూడి శ్రీనివాసరావు
అడ్వకేట్ & నోటరీ. సెల్: 98484 13620.
Enrolment Number: 1370/1987
తేది.21-10-2023

నేత్రపర్వంగా కూచిపూడి నృత్య ప్రదర్శనలు


కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారిణులు

విజయవాడకల్చరల్: దసరా మహోత్సవాల సందర్భంగా శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం, దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో కనకదుర్గానగర్‌లో నిర్వహిస్తున్న సాంస్కృతిక మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. నాట్యాచార్యుడు సప్తా శివకుమార్ బృందం కూచిపూడి సంప్రదాయంలో శివకైవారం, గణేష కౌత్వం, ధిల్లానా అంశాలను ప్రదర్శించారు. ఆంధ్రనాట్య నాట్యాచారిణి శారదా రామకృష్ణ కుంభహారతి, హైదరాబాద్‌కు చెందిన వై.విజయవల్లీ భరద్వాజ్ బృందం పార్వతీ కల్యాణం నృత్యరూపకాన్ని, అనన్య సీహెచ్ వీరభద్రరావు,బీహెచ్ శ్రావణి, సాయి సహస్ర, విశాఖపట్నానికి చెందిన టి.సందీప్ కుమార్ సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. జగదాంబ భక్తి, గీతాకుమారి త్యాగరాజ స్వామి కృతులను, ఆంజనేయులు భజన కీర్తనలను ఆలపించారు. సైదా, గంగాధర్, రామకృష్ణ నిర్వహించారు. వారికి ప్రసాదాలు, ప్రశంసా పత్రాలను అందజేశారు.

కోవూరి శ్రీనివాస్ స్మారక జాతీయ కార్డు కథల పోటీ

విజయవాడ కల్చరల్: రమ్యభారతి సాహిత్య మాసపత్రిక ఆధ్వర్యంలో కోవూరి శ్రీనివాస్ స్మారక జాతీయ కార్డు కథల పోటీ నిర్వహిస్తున్నట్లు రమ్యభారతి సాహిత్య మాస పత్రిక సంపాదకుడు చలపాక ప్రకాష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక స్పృహ కలిగిన ఏ అంశం మీదైనా పోస్ట్ కార్డు మీద మాత్రమే రాయాల్సి ఉంటుందని వివరించారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.1000, ద్వితీయ బహుమతి రూ.500, తృతీయ బహుమతి రూ.200 అని, నగదును ఫోన్‌పే లేదా గూగుల్ పే ద్వారా అందజేస్తామని ఆయన తెలిపారు. కథలను అక్టోబర్ 31వ తేదీలోపు రమ్యభారతి మాసపత్రిక, పోస్ట్‌బాక్స్ నెం: 5, విజయవాడ 520001 చిరునామాకు పంపాలని కోరారు.

ప్రైవేటు ట్రావెల్స్‌లో అధిక ధరలు వసూలు చేస్తే చర్యలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దసరా పండుగ రద్దీ దృష్ట్యా నిబంధనలకు విరుద్ధంగా బస్సులు నడిపినా, ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేసినా చర్యలు తప్పవని డీటీసీ ఎం.పురేంద్ర హెచ్చరించారు. రవాణా శాఖ అధికారులు శనివారం ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేశారు. డీటీసీ పురేంద్ర మాట్లాడుతూ.. విజయదశమి పండుగను పురస్కరించుకుని దూరపు ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల నుంచి అధిక చార్జీలను వసూలు చేయడం, టికెట్ ధరలు పెంచడం సరికాదన్నారు. ధరలు పెంచిన ట్రావెల్స్‌పై కేసు నమోదు చేసి బస్సులను సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు. జిల్లాలో 19 మంది మోటార్ వాహన తనిఖీ అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. రెండో డ్రైవర్ లేకుండా బస్సులను నడపడం, బస్సుల్లో సరుకు రవాణా చట్ట విరుద్ధమని పేర్కొన్నారు. ఇప్పటికే జిల్లాలో 190 ప్రైవేటు బస్సులపై కేసులు నమోదు చేశామన్నారు. ప్రయాణికులతో అసభ్యకరంగా ప్రవర్తించినా చర్యలు తప్పవన్నారు. నిబంధనలు అతిక్రమించే వారిని ఉపేక్షించేదిలేదని ఆయన హెచ్చరించారు.

రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు


పోషకాహార కిట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, కార్పొరేటర్ అంజనేయరెడ్డి తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. భవానీపురం 40వ డివిజన్ పరిధిలోని ఓ స్కూల్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం శనివారం నిర్వహించారు. ముందుగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. ఆరోగ్యాంధ్రప్రదేశ్‌ను నిర్మిద్దామంటూ ఏర్పాటు చేసిన బ్యానర్‌పై ఎమ్మెల్యే సంతకం చేశారు. అనంతరం గర్భిణులకు పోషకాహార కిట్లను అందజేశారు. శిబిరంలో వైద్య పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. వైద్య సేవలపై ప్రజలతో ఎమ్మెల్యే స్వయంగా మాట్లాడారు.

శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి..

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం వైఎస్ జగన్ లక్ష్యమన్నారు. వైద్య శిబిరాల ద్వారా పేదలకు మెరుగైన వైద్యంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. వలంటీర్లు, ఆశా వర్కర్లు ఇంటింటిని జల్లెడ పట్టి వైద్య పరీక్షలు చేయిస్తున్నారన్నారు. వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. వైద్యశిబిరంలో 40వడివిజన్ కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయ రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక సందడి





నగరంలో దసరా మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా ఏడో రోజైన శనివారం అమ్మ వారు లలితా త్రిపురసుందరీదేవిగా దర్శనమిచ్చారు. ఇంద్రకీలాద్రికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ








మహిళా నిందితుల అరెస్ట్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విజయవాడ రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు మహిళా నిందితులను జీఆర్పీ పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి 24 గ్రాముల బంగారు నానుతాడు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉత్తరప్రదేశ్‌కు చెందిన నీలు, ప్రీతి అనే ఇద్దరు మహిళలు పలు నేరాల్లో నిందితులు. విజయవాడ రైల్వేస్టేషన్‌లోని 10వ నంబర్ ప్లాట్‌ఫామ్‌పై శనివారం అనుమానాస్పదంగా తిరుగుతుండగా ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు అదుపులోకి తీసుకుని వారిని సోదాచేయగా 24 గ్రాముల బంగారు నానుతాడు ఉండటంతో స్వాధీనం చేసుకున్నారు. శనివారం ఉదయం పినాకిని ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కే క్రమంలో ఒక మహిళా ప్రయాణికురాలి మెడలో నుంచి నానుతాడును చోరీ చేసినట్లు తెలిపారు. వారిని అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపర్చగా రిమాండ్ విధించారు.